# మా మంచి వదిన!

వేదుల సీత



మా వదిన అందరి వదినల లాంటిది కాదు. సహనశీలి, శాంతమూర్తి. సుగుణాల రాశి— అదంతా యెందుకు? దేవతల్లో పుట్టవలసిన మనిషి, ఏ చిన్న శాపం వల్లో ఈ వసుధమీద వసుంధరగా జన్మించి వచ్చింది మా అన్నయ్యకు అర్ధాంగిగా. అన్నయ్య.... వాడు అందరిలాటివాడు ఐవుంటే వదిన ప్రత్యేకత—ఇంత శ్రద్ధగా నాకు తెలిసేదికాదు.

ముందుగా అన్నయ్య గురించి కొంచెం విశదీకరిస్తా. అన్నయ్య గ్రాడ్యుయేటు. తన డిగ్నిటీకి భంగం రాకుండా మంచి ఉద్యోగం చేస్తూ ఐదారు వందలు జీతం తెస్తున్నాడు. మనిషి కూడా మన్మధుడిలా వుంటాడు. ఎందుకు— అందమైన మనిషికి మనసు కూడా అందంగా ఉంటేనే ఆ మనిషి గుణగణాలు, అందచందాలు పదుగురిలో రాణింపుకొచ్చేది. కాని వ్యసనాలకు మొదటివాడైన అన్నయ్యలో పొరపాటున ఓ మంచి గుణం ఉందన్నా నమ్మదీలోకం. పట్టణంలో పక్కా రౌడీగా పేరుపొందాడు. నా అన్నయ్య ప్రత్యేకత ఊరూరా ఇంగువ వాసనలా గుప్పుమంది. నాన్న. అమ్మలు గుండెలు బాదుకొని గోలెత్తారు. వాడిని అలా హైద్రాబాదులో ఒంటరిగా వదిలేస్తే మరీ పేట్రేగిపోతాడు. ఉద్యోగం మానేసి మన వూరు వచ్చేయమనండి అంది. అమ్మ చాదస్తంగాని ఊరు, వాడ యేం చేస్తుంది; మనిషిలో వుంది గాని. అడ్డమైన అలవాట్లు ఉన్నవాడు అడవిలో వున్నా పాడవుతాడు. పనికివచ్చే గుణాలున్నవాడు. పదిమంది దుర్మార్గులవద్ద వున్నా నిగ్రహాన్ని చెడగొట్టుకోడు. నాన్న కూడా అదే మాట అన్నారు. మరేం చెయ్యాలన్న మీమాంస నిండుకుంది మా యింట్లో.

వెంటనే ఒక మంచి పిల్లను చూసి పెళ్ళి చేస్తే కుదురుగా వుంటాడేమో అంది అమ్మ. అఘోరించినట్లే ఉంది, ఆ అంట్లవెధవకు పిల్లనెవరిస్తారు? ఒకవేళ ఇచ్చినా ఆ పిల్ల గొంతు అడ్డంగా కోసినవాళ్ళమవుతాము. వాడికి కుదురు వచ్చేవరకూ పెళ్ళి. పెడాకులు వద్దు అన్నారు నాన్న. ఆయనంటే మగవారు కనుక వాడి గురించి అంత తేలికగా కొట్టి పడేశారు. కాని కన్నకడుపు అమ్మ అంత కాఠిన్యంగా ఎలా ఉండగలదు. యింట్లో వాళ్ళు యిలోమంటే పొరుగువాళ్ళు పొలోమన్నట్లు మన పిల్లవాణ్ణి మనమే లోకువ చేసుకుంటే పిల్లనిచ్చేవాళ్లు ముందుకెలా వస్తారు. మరోసారి వాడిని గడ్డిపోచక్రింద తీసి మాట్లాడితే నేను వూరుకునేది లేదు. ఆ....అమ్మ గట్టిగా నాన్నగార్కి వార్నింగు యిచ్చింది. వాడింకా పాడైపోకుండా పెళ్ళి చెయ్యడమె అమ్మ ధ్యేయం.

ఎలాగైతే సాధించింది. తీరా సంబంధం కుదిరి, అన్నయ్య అంగికారం కోసం ఉత్తరం రాద్దామనుకుంటుండగానే వాడే వూడిపడ్డాడు. పెళ్ళిసంగతులన్నీ చెప్పారు. "నేను ఆ విషయం చెప్పడానికే వచ్చాను. అక్కడో పిల్లను ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. కట్నాలు. కానుకలు యేమీలేవు అన్నాడు. మరి.... కులం, గోత్రం అంది అమ్మ. వాడికసలు పెళ్ళి కాదనుకుంటుంటే కాస్టు ఫీలింగు ఎందుకోయి. ఎవరో ఒకరు, ఓ యింటివాడు కావడమేగా నీకు కావలసింది" అన్నారు నాన్న. మారు మాట్లాడకుండా మా కుటుంబం మాత్రమే పెళ్ళికి వెళ్ళాం. తీరా పెళ్ళిలో తెలిసింది. పెళ్ళివారు మాకు దూరపు చుట్టాలే. మా వాళ్ళే కావడం అమ్మకు మహదానందాన్ని ఇచ్చింది.

ముఖ్యంగా అమ్మ కంటికి కోడలు మహాలక్ష్మిలా కనబడింది. నిజానికి వదిన చాలా అందంగా వుంది. చూడగానే ఆకర్షించే పద్ధెనిమిదేళ్ళ పరువంతో అందమైన విగ్రహం, మంచి పెర్సనాలిటీ. అటువంటి దీపశిఖలాంటి వదినముందు అన్నయ్య ఎందుకు పనికివస్తాడనిపించింది. పెళ్ళయ్యాక నాల్గురోజులు ఉంచుకు పంపుతామని, వదినను మాతో మా ఊరు తీసుకెళ్ళాం. ఆ నాల్గు రోజులలోను వదిన గుణగణాలను ఆమూలాగ్రం చదివేసింది అమ్మ. పిల్లంటేవజ్రం,పుత్తడిబొమ్మలాంటి ఈ పిల్లను వాడేం బాధలు పెడతాడోనని భయంగా వుంది అని ఆవేదన వ్యక్తం చేసింది అమ్మ,. నీ ముఖం— ప్రేమించి పెళ్ళిచేసుకున్నవాడు చూడకేం చేసాడు. నెత్తి నెక్కించుకోడు నీ కొడుకు. మేరేం

## క్షమించు వదిన !


భయపడకు అని నాన్న ధైర్యం చెప్పబోయారు.

కొత్త వింత. పాత రోతాను. నిలకడలేని మనుష్యులు. మోజు తీరేదాక ఓలాగ తర్వాత ఓలాగ చూస్తారు. అదంతా ఎందుకు మన ఊరు కరణం కొడుకేం చేశాడు. ప్రేమించి చేసుకున్న పిల్లను పెళ్లై ఏడాది తిరక్కుండానే నూతిలోకి తోసెయ్యలేదూ. ఇంకా ఏవేవో సాకులు చెప్పి, ఎలాగైనా కొన్నిరోజులు వాళ్ళదగ్గిర ఎవరేనా వుండాలి అంది. గోపీ నెల్లాగా (గోపీ అంటే నేను) మెడిసిన్‌లో జేర్చాలనుకొంటున్నాం గనుక హైద్రాబాద్ పంపిద్దామన్నారు నాన్న. నా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఎందుకంటే అందమైన హైద్రాబాదు పట్టణంలో కొత్తవదిన చేతి ప్రసాదం తింటూ చదువంటే ఎవరిష్టపడరు? కాని ఒక్క "పికరు" నాలో ప్రవేశించింది. ఒదిన బాగోగులు చూడ్డానికి గార్డియన్‌గా నన్ను అక్కడ నియమిస్తున్నారు. నాకంటే పెద్దవాడైన అన్నయ్య తప్పుడు పనులు చేస్తే, కేకలువేసే అర్హత నాకు ఉండవే. ఆ .... ఒకరి కొకరం వదిన, నేనూ ఉంటాంగా అని మరోసారి అనుకొన్నా. వదిన మాత్రం ఆరిందా ఏమిటి? నాకంటే ఏడాది చిన్నదే కావచ్చు. చిన్నఐనా, పెద్దదైనా ధైర్యే సాహసే లక్ష్మి అన్నారు పెద్దలు. ముందుగా అన్నయ్య ఆజ్ఞగైకొని, చివరకు మెడిసిన్‌లో చేరడానికి నిశ్చయించుకొని, వదినను తీసుకొని హైద్రాబాదు జేరాను. ఐదారు నెలలు గడిచిపోయాయి. ఆ ఐదారు నెలలూ వదినే అన్నయ్య. అన్నయ్యే వదినగా ఎంతో ఆప్యాయంగా ఆనందంగా గడపారు కాలాన్ని. ఇంక అక్కడినుండి మొదలయ్యాయి అన్నయ్య తైతక్కలు.

సాయంత్రం ఆఫీసు కాగానే ఇంటికి రాడు. నలుగురు స్నేహితులతో కలసి అర్ధరాత్రి వరకు రోడ్డు సర్వే చెయ్యడం. అందమైన ఆడవాళ్ళు కనబడితే ఎలాగో వాళ్ళ ఎడ్రసు కనుక్కొని మచ్చిక చేసుకోవడం. దీనస్థితిలో వున్న ఆడపిల్లలను ఉద్యోగా లిప్పిస్తామని మాయమాటలతో నమ్మించి. ప్రతిరోజూ ఇంటికి తీసుకువచ్చి పరిచయం పెంచుకునేవాడు. అభంశుభం తెలియని అమాయకులు నిజమేనని నమ్మి చివరకు తమ శీలాన్ని అర్పించి, అన్నయ్య నుండి అఘ్రాణిత పుష్పాలలా విసరివేయబడినవాళ్ళు. మళ్ళీ మరో కొత్త పిట్ట. వాళ్ళకు కాఫీ. టిఫిన్‌లు వదినచేతే చేయించి ఇప్పించేవాడు. నువ్వు చెయ్యనని చెప్పు వదినా. కావాలంటే హోటలు నుంచి తెప్పించుకోమని అనేవాణ్ణి. తప్పు గోపీ. ఇంటికి వచ్చినవాళ్ళను మర్యాద చెయ్యడం ఇల్లాలి కర్తవ్యం అని చిరునవ్వుతో సత్కారాలు చేసేది. జీవితం అలా సాగినా, అంత అనుకోనఖ్ఖరలేదు. కాని అన్నయ్య కర్కోటకుడిలా మారేడు. తాగివచ్చి వదినను నానా మాటలు అని తన్నేవాడు. గిల్లితే పాలుకారే వదిన వళ్ళు దెబ్బలతో కమిలిపోయిన కంతులుకట్టేది. చదువు, సంస్కారంవున్న అన్నయ్య యిటువంటిసంస్కారవిహీనమైన పనులు చేస్తుంటే వదినమిద జాలి ఉప్పెనలా పొంగింది నాలో. ఇది ఇల్లా వుండగా మొగుడు కొట్టినందుకుకాదు తోడికోడలు దెప్పినందుకు అన్న సామెతగా ఇరుగుపొరుగువారి యీపెల్లాంటి మాటలతో వదిన హృదయం తూట్లుపడేది.

మేము కాపరం వున్నది పదికుటుంబాలు గల పెద్ద భవనంలో. పిల్లి కళ్ళుమూసుకుని పాలు తాగుతూ, తనను యెపరూ చూడటం లేదనుకుంటుందిట. మేము మా యింటిగుట్టు ఎవరితోను చెప్పుకునేవారం కాదు. కాని తెల్లారి లేస్తే ఆడపిల్లలను వెంటేసుకు తిరిగే అన్నయ్యను ఎవరికీ కనపడకుండా దాచడం వీలవుతుందా. అక్కడినుండి యిరుగమ్మ పొరుగమ్మలు బుగ్గలు నొక్కుకోవడం, చెవులు కొరుక్కోడం. పైగా వదిన దగ్గరకువచ్చి ఇది సంసారులిల్లా? సానులిల్లా అల్లా బజారుముండల్ని వెంటతీసుకువస్తాడు మీ ఆయన అనేవారు. అందుకే అంటారుయింట్లోవాళ్ళకువెరవకపోయినా, సంఘానికి బెదరాలని. కాని అన్నింటికీ బరితెగించిన అన్నయ్య యెవరికీ వెరవడు. ఇంక యిది పనికాదని నాన్నగారికి ఉత్తరం వ్రాస్తానని వదినతో అన్నాను, అమ్మయ్యో. అంతపని మాత్రం వద్దు అని బ్రతిమాలింది. అదీగాక తండ్రి అంత కొడుకుని, మీ నాన్నగారు మాత్రం వచ్చి యేమని కేకలేస్తారు. యిటువంటివి ఎవరికీ, ఎవరూ చెబితే వచ్చేవికావు. యెవరికి వారే తాము చెడిపోతున్నాము అని తెలుసుకోవలసిన నగ్నసత్యాలు అంది. వదిన అన్నదాంట్లో నిజం లేకపోలేదు. నాన్నగారువచ్చి నాలుగుకొట్టి కూర్చోబెట్టడానికి అన్నయ్యేం పాలుతాగే పసిపిల్లవాడా? తాను గోతిలోపడుతున్నది గుర్తించకుండా, ఎదుటివారికి నీతులు చెప్పడం చేతనైన సమర్థుడు. కట్టెవంకర పొయ్యితీర్చాలన్నట్లు అన్నయ్యలాంటి మర్కటాలను మార్చడం మనుష్యులవల్లకాదు. ఆ భగవంతుడే వాడికెప్పటికేనా తోడ్పడాలి. అంతవరకు వదిన ఆవేదన, బాధలు చూడక నాకు తప్పదు. తప్పదు అని గట్టిగా నిశ్చయించుకున్నాను. కొవ్వొత్తిలాంటి కాలం నిమిషాల్లో కరిగిపోయింది.

నేను మెడిసిన్ మూడవ సంవత్సరంలో ప్రవేశించా. అన్నయ్య పరిస్థితిమాత్రం "యథాప్రకారంగానే" సాగుతోంది. మనిషిలో ఏ మార్పులేదు. వదిన మనసులో యేమనుకుంటోందో నాకు తెలియదుగాని వాడు మారతాడనే ఆశ నాలో అడుగంటుకుపోయింది. భార్య అనే స్త్రీ యింటిదగ్గర ఒకతె వుందని, ఆమె మనసున్న మనిషేనని, పట్టిబొమ్మకాదని వాడు గుర్తించే స్థితిలోలేడు. అసలు నాలుగైదు రోజులుగ్గాని యింటికి రావడంలేదు. ఆ పరిస్థితి పస్నెత్తి ఒకరితో చెప్పుకుందుకు సంస్కారం అడ్డువచ్చిన వదిన ఒంటరిగా



కూర్చుని తనలోతానే కుళ్ళిపోయేది. అదే మనోవ్యధతో మరికొన్నాళ్ళువుంటే వదిన మంచం ఎక్కడం ఖాయం. ఆమె మనసుకు కాస్సేపేనా రిలీఫ్ కల్పిస్తేగాని, వదిన చైతన్యం నశించిన శిలావిగ్రహమవుతుంది. కాని ఎలా? గంటలతరబడి బజారుస్త్రీలను వెంటేసుకుతిరిగే అన్నయ్య వదిననుతనతోతీసుకువెళ్ళడంచిన్నతనంలా భావిస్తాడు. ఇంక వదిన శ్రేయస్సు కోరేవాణ్ణి నేనే కనుక నాకు తప్పదు. ఓ రోజు ఉదయం కాలేజీకి వెడుతూ వదినతో సాయంత్రం "మేరానామ్ జోకర్" పిక్చరుకి వెడదాం. సిద్ధంగావుండమని ఒప్పించి వెళ్ళాను. సాయంత్రం యింటికివస్తూ వదినకు మల్లె పూలు కొనితెచ్చాను. వదిన కట్టుకోవలసిన చీరకూడా నేనే సెలెక్టుచేశాను.

తెల్లటి ఫారిన్ నైలెక్సు శారీకి చుట్టూ ఆకుపచ్చ బోర్డరు. మధ్య మధ్య చిన్న చిన్న ఫ్లవర్సు. అసలే అపర రతిదేవిలాంటి వదిన ఆ చీరలో మరింత అందంగా వుంది. కాదు ....వదిన కట్టుకోవడంలో ఆ చీరకు అందం వచ్చిందా అన్నట్లుంది. కొన్ని నిమిషాలు రెప్పపాటు మానేసి వదినను చూశాను. వదినలో వుండే ఈ అందం అన్నయ్య ఒక్కసారేనా రెండు కళ్ళతో చూశాడా? చూసినా సౌరభాలు విరజిమ్మే సన్నజాజి మొగ్గలాంటి వదిన సౌందర్యాన్ని ఆస్వాదించలేని అవివేకియై ఎందుకూ పనికిరాని గడ్డిపూలకోసం పరుగెడుతున్నాడు. "ఏమిటి గోపి.... అలా నిలబడిపోయావు. టైమైనట్లుంది" చేతినున్న స్క్వేరు వాచీ కేసి చూసుకుంటూ, "ఆ.... ఔను రిక్షా తీసుకు రానా" అన్నాను. "వద్దు బాబు. పిచిగూడులాంటి ఆ రిక్షాలో గువ్వలా ముడుచుకు కూర్చోడం. నావల్లగాదు. హాయిగా బస్సులో పోదాం" అంది.

ఛీ....వెధవబస్సు. గంటసేపు వెయిటు చేస్తేగాని రాదు. వచ్చినా ఆ తొడ తొక్కుడులో తోసుకుంటూ సుకుమారమైన వదిన ఎక్కగలదో, లేదో రిక్షాఐతే రివ్వున ఎగిరే గువ్వల్లా వెళ్ళిపోవచ్చు. కాదంటే.... కాస్త ఇబ్బంది. ఐతే అందమైన వదిన పక్కన నేను. నా పక్కన వదినా. ఎంత హాయిగా ఎంత వెచ్చగా వుంటుందో! ఎన్నడూ లేనిది నాకీ వింత కోర్కెయేమిటి? తల్లి లాంటి వదినను గురించే నేనిలా వూహిస్తున్నా? నన్ను నేనే తిట్టుకొని మనస్సు అధీనంలో వుంచుకోవాలని చూశా. 'సరే వదినా. బస్సులోవెడదా'మని యింటికి తాళం పెట్టి బస్సుస్టాపు వద్దకు వెళ్ళి నిలబడ్డాం. ఎంతకూ బస్సు రాలేదు. సరిగ్గా పిక్చరు ప్రారంభించటానికి పది నిమిషాలు పైముంది. ఇంక వదినకే




చెట్టుకింద సంసారం
చిత్రం : పాకమల్లేశం, హన్మకొండ

తోచిందేమో. రిక్షాలో పోదాం గోపి అంది.

వదిన అన్నదే తడవుగా రిక్షా మాట్లాడాను. పైకి మటుకు నువ్వు రిక్షాలో వెళ్ళు నేను బస్సులో వస్తానన్నా. చిన్న పిల్లవాడవు నీకేమిటి .... రా .... కూర్చో అంది చోటిచ్చి. వదిన అలా అంటూంటే నాకెందుకో సిగ్గేసింది. యిరవై రెండేళ్ళ నేను వదిన కంటికి చిన్న పిల్లవాడినా. నేను చిన్న పిల్లవాడినికానని వదిన గుర్తించడం యెలా. వదిన శరీరం నా శరీరానికి తగులుతుంటే ఏదో వింత అనుభూతి కలుగుతోంది. వదిన జడలోవున్న మల్లెపూల నుండి మత్తెక్కించే సువాసన. నా నాసికాల్లో దూరి సన్నేదేదో లోకాల్లోకి తీసుకుపోతూ నా చేతులకు చైతన్యాన్ని కలిగించింది. నాకు తెలియకుండానే నా చెయ్యి వదిన నడ్డి వెనక్కి వెళ్ళింది. అక్కడ నుండి యింకా. యికా ముందుకు పోతోంది. నాచెయ్యి, పాము కుబుసం లాంటి ఆమె పొట్టమీద పాకుతూ పైకి పోతోంది; ఎత్తైన ప్రదేశం యేదో చేతికి తగిలింది. ఆ స్పర్శకు నాలో విద్యుత్తు ప్రవేశించినట్లనిపించింది. అంతలోనే నా చేతిని ఎవరో పట్టి లాగుతున్నట్లైనది. ఎవరు.... ఎవరు.... వులిక్కిపడి వాస్తవంలోకి వచ్చాను. వదిన.... వదిన నాకేసి క్రోధంగా చూస్తోంది. చటుక్కున చెయ్యి వెనక నుండి తీసేసి తలవంచుకున్నాను. వెంటనే వదిన రిక్షాను వెనక్కి తిప్పించేసింది. హఠాత్తుగా మాలో వచ్చిన మార్పు అర్థంగాని రిక్షావాడు ఆశ్చర్యంగా మాకేసి చూసి రిక్షా యింటిదారి పట్టించాడు. రిక్షాలోంచి యే లోయలోకో దూకి పోతున్నాననిపించింది. నా తొందరపాటు తలుచుకోగానే శరీరమంతా ముచ్చెమటలు పట్టింది. యిప్పుడీ చూపుల్లో అగ్ని కురిపిస్తున్న వదిన యింటికి వెళ్ళగానే యెలా మారుతుందో నా వూహకు కూడా అందలేదు. బహుశా తిడుతుంది. అప్పటికీ కోపం తీరకపోతే కొడుతుంది నేను చెయ్యబోయిన పనికి.వదిన నాకే శిక్ష విధించినా తప్పులేదు. కాని నేను అనుకున్నట్లు వదిన యింటికెళ్ళాక. ఏ కాళీ అవతారం యెత్తలేదు. కోపం మాత్రం ముఖంలో కొట్టవచ్చినట్లు కానవస్తోంది. మూడు సంవత్సరాలుగా వదిన కరుణారస వీక్షణాల్లో కాలం వెళ్ళబుచ్చిన నేను ఆమె కోపం కొద్ది నిమిషాలేనా భరించలేక విలవిల లాడిపోయాను. చివరికెలాగో ధైర్యం కూడ గట్టుకొని నన్ను క్షమించు వదినా. నువ్వలా వుంటే నేను చూడలేను అన్నాను

"ఇంక ఆ నక్క వినయాలు ఎందుకు గోపి? పాముకు పాలుపోసి పెంచితే మాత్రం దాని బుద్ధి పోనిచ్చుకుంటుందా? నువ్వుమాత్రం ఆ అన్నకితమ్ముడవుకాదూ! ఇన్నాళ్ళు నీ వినయ విధేయతలు చూసి మీ అన్నయ్య యిల్లు పట్టకుండా తిరుగుతున్నా కటిక చీకటిలో కాంతికిరణంలా. నువ్వే నాకు సాయం వున్నందుకు మురిసిపోయా. కాని ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది" వదిన చెంపదెబ్బ కొట్టినట్లు తెలియజేసింది. ఇంకా యేమనేదో వదిన మాటలు విని భరించే ఓపిక నాలో నశించి "ప్లీజ్ వదినా నన్నింకేమీ అనకు. నిజంగా అన్నయ్యలాంటి వాడను కాను. ఏ దుష్టశక్తి సహాయంతోనో ఆ టైములో, అలా తొందరపడ్డా. అందుకు యిప్పుడు పశ్చాత్తాపపడుతున్నా. నిజంగా నాలో యేదుర్బుద్ధీ లేదు వదినా. నీ దగ్గర యెప్పుడూ చిన్నపిల్లవాడినే. తెలియక పిల్లవాడు తప్పుచేస్తే మందలించడం తల్లి బాధ్యత. నన్ను క్షమించు అమ్మా! వదినా వదినా" అని ఆమె కాళ్ళుపట్టుకున్నా. ★